క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



తాడేపల్లిరూరల్: తమకు రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారానికి 307వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకుడు స్టీవెన్, వై.సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలో షైక్ ఇమాంబి, ఈదులమూడి శరమ్మా, వేము రిబ్కా, దామవరపు సువర్ణకుమారి, డి.నాగేశ్వరావు కూర్చున్నారు. కార్యక్రమంలో సీ హెచ్ పిచ్చయ్య, గురవయ్య, వై.సుబ్బారావు, టి.దుర్గాభవాని, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పీఎస్ వద్ద వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ ముందుగా పెద్ద ఎత్తున పెరిగిన చెత్తను, పిచ్చి చెట్లను పారిశుద్ధ్య కార్మికులు సోమవారం తొలగించారు. పెద్ద ఎత్తున ఇక్కడ గడ్డి పెరగడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయని స్టేషన్‌కు వివిధ పనుల మీద వచ్చే బాధితులు వాపోతున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్ తదితర వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆ ప్రాంతమంతా శుభ్రం చేశారు.

ఇంటి స్థలం కోసం కదులుతున్న పేదలు



తాడేపల్లిరూరల్: ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా.. పాలకుల మాటలు నీటి మూటలుగా మారాయని, సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న ఆందోళనకు తరలివస్తామని పేదలు చెబుతున్నారు. అర్హులైన వారందరికీ 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం డోలాస్ నగర్, ప్రభు నగర్ ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలు అర్జీలు రాయించి పేదలకు అందజేశారు. ఈ నెల 17వ తేదీన మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు తరలివస్తామని పేదలు తెలిపినట్లు సీపీఎం నాయకులు చెప్పారు. కార్యక్రమంలో నేతలు నీరుడు దుర్గారావు, వి శాస్త్రి, పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా దుగ్గిరాల



దుగ్గిరాల: స్వచ్ఛతా హి సేవలో ఉత్తమ గ్రామ పంచాయతీగా దుగ్గిరాలకు అవార్డు లభించింది. సోమవారం గుంటూరులో కలెక్టర్ నుంచి సర్పంచి బి.ఖుషీ బాయి అవార్డు అందుకున్నారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా పోకూరి రూప ఎంపియ్యారు. వారికి ప్రశంసా పత్రం అందించారు.

మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంటు..



పొన్నూరు: అధికారుల నిర్లక్ష్యంతో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించేందుకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసింది. కొంతకాలానికి మరమ్మతులకు గురికావడంతో ఆర్వో ప్లాంటు మూలకు చేరింది. ఫలితంగా రక్షిత జలం అందడం లేదు. అప్పటి నుంచి హాస్టల్ వార్డెన్ సమస్యను ఉన్నతాధికారులకు చెబుతూనే ఉన్నారు. అయినా ప్లాంటుకు మరమ్మతులు చేయడం లేదు. అధికారులకు మరోసారి సమస్యను తెలియజేస్తామని వార్డెన్ వెంకటేశ్వరమ్మ అన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు

దుగ్గిరాల: రైతులకు పంట నష్టం కలగకుండా సామూహిక ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం మండలం కేంద్రం దుగ్గిరాలలోని రైతుసేవా కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ పంట నష్టం కలగకుంగా ఎలుకల బొరియలలో మట్టి పెట్టి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం బ్రోమోడయోలిన్ ఎలుక మందు పంపిణీ ఉంటుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కాలువ ఇలా.. మురుగు పారేదెలా!



తాడేపల్లి వెంకయ్య కొట్టు సెంటర్లోని కల్వర్టు వద్ద మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. నీరు పారుదల లేక దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ డ్రైనేజీ తోటలో నుంచి రైల్వే స్థలంలోకి వెళ్లి అక్కడనుంచి బకింగ్ హాం కాలువలో కలుస్తుంది. రోజుల తరబడి చెత్త తీయకపోవడంతో సోమవారం కాలువ పొంగి రోడ్డు పైకి మురికి నీరు వచ్చి చేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై పలుసార్లు పారిశుద్ధ్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించిన వారే లేరని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంటీఎంసీ అధికారులు స్పందించాలని సీపీఎం శాఖ కార్యదర్శి కోటా బాబురావు కోరారు.

–తాడేపల్లిరూరల్

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి



సమావేశంలో వ్యాపారులు

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో సోమవారం సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై క్లాత్ రశాలలు, బ్యూటీపార్లర్లు, స్పా, యోగా, జిమ్ నిర్వాహకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీని ప్రతి వినియోగదారునికి నిర్వాహకులు తెలియజేయాలని సూచించారు. కొత్త జీఎస్టీ ప్రకారం వివిధ రంగాల వారీగా వర్తింపు ఎలా జరుగుతుందనే వివరాలను క్లుప్తంగా వివరించాలన్నారు. ఈ తగ్గింపుతో కుటుంబానికి నెలకు ఎంత ఆదాయం ప్రయోజనం కలిగిస్తుందనేది ప్రజలకు ఇంటింటికీ వెళ్లి అధికారులు, సచివాలయ సిబ్బంది తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పద్మనాభం, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ మున్నంగి శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికల ముందు కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తురక రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న 179వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తురక రామారావు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల జనాభా కల్గిన వడ్డే, వడ్డీలుగా పిలుస్తూ సంచార జీవనం సాగిస్తూ దేశ వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో, కర్ణాటకలో ఎస్సీ, తమిళనాడులో ఎస్సీ, కేరళలో ఓబీసీ, ఎస్టీలుగా, ఏపీ, తెలంగాణలో మాత్రం ఇప్పటికీ బీసీలుగా ఉన్నారని పేర్కొన్నారు. వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర అధ్యక్షుడు కుంచాల కృష్ణకిషోర్ మాట్లాడుతూ భవిష్యత్తులో రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా నిరంతరం శాంతియుత ఉద్యమాలు కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లపు శ్రీను, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మల్లె శ్రీనివాస్, మంగళగిరి నాయకులు వేముల వెంకటేష్, మీనిగ ఆంజనేయులు, వేముల పూర్ణ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం ఘటనపై విచారణ చేయించండి



తాడేపల్లిలో గురుకులం డెప్యూటీ సెక్రటరీ అడ్మిన్ మధుసూదన్‌వర్మకు వినతిపత్రం అందజేసిన వడిత్యా శంకర్‌నాయక్

తాడేపల్లిరూరల్: కురుపాం ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. తాడేపల్లిలో గురుకులం డెప్యూటీ సెక్రటరీ అడ్మిన్ మధుసూదన్ వర్మను కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ మన్యం పార్వతీపురం జిల్లా, కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 5న విద్యాలయంలోని 611 మంది విద్యార్థినులకు, 120 మంది కలుషిత ఆహారం, తాగునీరు తీసుకున్నందున అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. వీరిలో ఇద్దరు విద్యార్థినులు ఆరోగ్యం క్షీణించి చనిపోయారన్నారు. గురుకుల విద్యాలయంలో మౌలిక సదుపాయాలు లోపంతో విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నా తాగునీరు, మరుగుదొడ్లు, వసతి గృహం వంటి మౌలిక సదుపాయాలు సరిగా లేని కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు సకాలంలో స్పందించకే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మరణించిన విద్యార్థినుల కుటుంబాలకు రూ.25 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి, ఇంటి స్థలం చట్టప్రకారం అందజేయాలన్నారు. తక్షణమే పాఠశాలలో శుద్ధమైన తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. బాధ్యత వహించాల్సిన అధికారులపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినుల ప్రాణభద్రతకు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య యువజన అధ్యక్షులు ఇస్లావత్ హనుమంతునాయక్, బాణావత్ తేజ నాయక్, పాతలావత్ దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ వ్యాధి దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విఘ్నేష్

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎయిమ్స్ జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ విగ్నేష్ పేర్కొన్నారు. కఠెవరం గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం స్క్రీనింగ్ నిర్వహించారు. క్షయ మందులు వాడే వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు వాడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి లోపిస్తుందని, తద్వారా మళ్లీ క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు సంవత్సరాల నుంచి మందులు వాడిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి చికిత్స పొందిన వారికి ప్రతి ఆరు నెలలకు స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి ఝాన్సీ లక్ష్మీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనలో అరెస్ట్

దుగ్గిరాల: దేవరపల్లి అగ్రహారంలో ఏఈఎల్‌సీ చర్చిలో ఇరు వర్గాల ఘర్షణ పై కేసు నమోదైన ఘటనలో పాల్గొన్న వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారంలోని ఏఈఎల్‌సీ యాజమాన్యం కొత్త పాస్టర్‌ను నియమించే విషయంలో వివాదం తలెత్తింది. ఆదివారం జరిగిన ఘర్షణలో పాముల మోహన్ తలకి తీవ్ర గాయం అవ్వగా, అతని ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. పోలీసులు కర్రి మధుబాబు, కర్రి కిరణ్, బాబురావును అరెస్టు చేసి కోర్టుకు తరలించారని దుగ్గిరాల ఎస్సై వెంకట రవి తెలిపారు.

మార్జిన్ దిగితే అంతే..



అధ్వానంగా గరికపాడు, బండారుపల్లి ప్రధాన రహదారి

బండారుపల్లి(తాడికొండ): గరికపాడు నుంచి బండారుపల్లి మీదుగా మందపాడు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమై గోతులమయంగా మారింది. ఈ రోడ్డుపై పేరేచర్ల స్టోన్ క్రషర్స్ నుంచి అధిక లోడుతో వెళుతున్న లారీలు నిత్యం వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డు పూర్తిగా శిథిలమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

హౌసింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

దుగ్గిరాల: హౌసింగ్ కాలనీలోని దోమలు, వాటర్ ట్యాంకు నిర్మాణం, సినిమా హాలు నుంచి కాలనీ వైపు వంతెన నిర్మాణం చేపట్టాలని సమస్యల పై వినతి పత్రం అందించారు. సోమవారం దుగ్గిరాలలో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా నాయకులు ఈమని అప్పారావు ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనంతవరం గోశాలకు పశువైద్య శాఖ నోటీసులు

రెండు రోజుల్లో సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశాలు

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరంలో నిర్వహిస్తున్న గోకులం గోశాల ట్రస్ట్‌ను రెండు రోజుల్లో తరలించాలని పశు వైద్యాధికారి శ్రీ పతి రేణుకాదేవి ఆదేశాలు జారీ చేశారు. గోకులంలో 350 గోజాతి పశువులు, సరైన నీడు, దాణా సదుపాయాలు లేక నీరసిస్తున్నాయని, సీఆర్డీయే స్థలంలో అనుమతి లేకుండా వాటి నిర్వహణ చేస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతిలేని గోశాలను రెండు రోజుల్లోగా తరలించాలని నిర్వాహకులకు ఆమె నోటీసులు జారీ చేశారు.

'కళ్లం'లో పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా ఎనాలసిస్‌పై వర్క్ షాప్

గుంటూరు రూరల్: కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసించే విద్యార్థులకు వర్క్ షాప్స్(కార్యశాల) ద్వారా విద్యార్థులలో నూతన విషయాలు నేరుగా తెలుసుకునే అవకాశాలు ఏర్పడతాయని కళ్లం హరినాథ్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (స్వయం ప్రతిపత్తి) డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో సీఎస్సీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ సంస్థ సహకారంతో 'ఎక్స్‌ప్లోపరెటరీ డేటా ఎనాలసిస్ విత్ పైథాన్' అంశంపై 9 రోజుల వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్సీ విభాగాధిపతి రాజీవ్ జట్సన్ మాట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్ భాషపై పూర్తి ఆధిపత్యం చెలాయించడంతో పాటు డేటా సైన్స్ రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను తీర్చగల స్థాయికి ఈ శిక్షణ దోహద పడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ ప్రతినిధి లక్ష్మణ్ అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాసరావు, చుక్క సామ్సన్, కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

తాడేపల్లిరూరల్: మంగళగిరి మండల పరిధిలోని చినకాకాని గ్రామ ఎస్సీ కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని సీపీఐ గ్రామ నాయకులు, ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ప్రస్తుతం మూడు రేషన్ డిపోలు ఉన్నా అవన్నీ గ్రామం రెండవ వైపునే ఉండటంతో ఎస్సీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన దాదాపు వెయ్యి రేషన్ కార్డు దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ప్రతి నెలా రేషన్ సరుకులు తీసుకునేందుకు మహిళలు, వద్దులు సుమారు కిలోమీటరున్నర దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని, తిరిగి భారమైన సరుకులు మోసుకొని రావడం చాలా కష్టమైపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, గ్రామంలో అందుబాటులోకి తేనున్న కొత్త రేషన్ డిపోను ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ కార్యదర్శి కటారి జేసుదాస్, సీనియర్ నేత కటారి జోజి వినతి పత్రాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో మంగళవారం మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం



పెదకాకాని: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెదకాకాని మండలంలోని నంబూరు శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా పండుగ పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన శనగల బలరామిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు ప్రతి రోజూ ఒక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజలు జరిపించారు. కనకదుర్గ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని స్వాగతించి కొబ్బరికాయలు, పసుపు,కుంకుమలు సమర్పించారు. తీన్‌మార్ తప్పెట్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు సందడి చేశారు. రాత్రి గ్రామ శివారులోని కాలువలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

మురుగు కాల్వలను నిర్మించండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని నిర్మించే విధంగా చూడాలని 3వ వార్డుకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 32వ వార్డులో స్ట్రీట్ లైట్లు బాగు చేయాలని, మున్సిపల్ స్థలంలోని అక్రమణలు తొలగించాలని పలువురు వినతిపత్రం ఇచ్చారు. అన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనువాసులు తదితరులు ఉన్నారు.

సందడిగా సంప్రదాయ దుస్తుల పోటీలు



విజేతలతో సాయిమాధవ్ బుర్రా, ఇతర అతిథులు

తెనాలి: స్థానిక గీతామందిరంలో శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆడపిల్లలకు సంప్రదాయ దుస్తుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉప్పులూరి శారద, నారాయణ భారతిదేవి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలకు మొత్తం 50 మంది చిన్నారులు హాజరయ్యారు. వీరిలో వివిధ కేటగిరీల్లో 16 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, అయినాల మల్లేశ్వరరావు, కంకిపాడు రమేష్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పి.జ్యోత్స్న, లక్ష్మీమాధవికి మొదటి బహుమతి రూ.1,000 చొప్పున, రెండో బహుమతిగా ఎ.వెన్నెల, కె.హన్సికరెడ్డికి రూ.500 వంతున, జె.దైవజ్ఞ, వి.కోమలశ్రీ, టి.పరమేశ్వరప్రియకు మూడో బహుమతిగా రూ.300 చొప్పున బహూకరించారు. మరో పదిమందికి రూ.100 చొప్పున ప్రోత్సాహ బహుమతిని అందజేశారు. నేటితరం సంప్రదాయాన్ని మరవకూడదనే భావనతో ఈ పోటీలను నిర్వహించినట్టు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. వీరంశెట్టి రజిని, తల్లం సావిత్రి, కర్ణాట జయలక్ష్మి, కటకం అన్నపూర్ణ, నంబూరి వినతి, దేవానంద్, వేమూరి విజయభాస్కర్ పాల్గొన్నారు. కొండపి వసుంధర పర్యవేక్షించారు.

శివ శివా.. ఇదేమి స్వామీ!

శివాలయం లడ్డు పోటుకు మురుగు దెబ్బ



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయంలో లడ్డు తయారీ చేసే షెడ్డు పక్కనే నిల్వ ఉన్న మురుగునీరు దుర్గంధం వెదజల్లుతోంది. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా లడ్డు పోటు షెడ్డు గేటుకు ఇరువైపులా మురుగునీరు నిల్వలు, పశువుల వ్యర్థాలు వెక్కిరిస్తున్నాయి. లడ్డు తయారీకి ఏర్పాటు చేసిన పిండి మర వద్దకు మురుగునీటి తేమ వస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లడ్డు తయారీ అక్కడ నుంచి మరొక ప్రదేశానికి మార్చడం గానీ, ఆ ప్రదేశంలో ఉన్న మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవడం, పశువుల వ్యర్థాలు తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.